

మహిళా సంరక్షణపై అవగాహన


ఎస్ఐకుచిత్రపటాన్ని బహూకరిస్తున్న విద్యార్థినిలు

ప్రజాశక్తి - అల్లవరం

గోడిలంక హైస్కూల్లో ఎస్ ఐ హరీష్‌కుమార్ బుధవారం మహిళా సంరక్షణపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లా డుతూ సమాజం లో మహిళల పట్ల జరిగే నేరాలు జరగకుండా చేపట్టే ముందస్తు చర్యలు గురించి విద్యార్థులకు వివరించారు. గుడ్, బ్యాడ్ టచ్, ఈవ్‌టీజింగ్, పోస్కో చట్టాలు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన, రోడ్ ప్రమాదాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు స్టేషన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మినీ గోకులాలకు శ్రీకారం

- షెడ్లు నిర్మాణలతో రైతులకు మేలు
- ఉపాధి హామీ చట్టం కింద రాయితీ
- పాడి రైతులకు 90 శాతం సబ్సిడి


మినీ గోకులం (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - రాజోలు

ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పాడిరైతుల సంక్షేమాభివృద్ధి కోసం చర్యలు చేపట్టింది. మినీ గోకులం షెడ్ల మంజూరుకు శ్రీకారం చుట్టింది. వాటికి పూర్వవైభవం తెచ్చేందుకు అడుగులు వేస్తోంది. గ్రామాల్లో పశుపోషణ,కోళ్ళ, గొర్రెలు, మేకలు పెంపకానికి మెరుగైన వసతి కల్పిస్తూ, పెంపకందార్లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పశువుల నివాసానికి కొద్దిపాటి స్థలం ఉంటే మినీగోకులం పేరిట షెడ్లు నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. ఇటీవల పశుసంవర్ధకశాఖ అధికారులు గోకులం ఎంపిక ప్రక్రియకు చర్యలు చేపట్టడంతో పశుపోషకుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 2.29 లక్షల పశువులున్నాయి. వీటిలో 75,640 ఆవులు, 1,53,542 గేదెలు ఉన్నాయి.వీటిపై ఆధారపడిన రైతులు మీని గొకులాల పథకం వినియోగించుకుంటే మేలు జరుగుతుంది.

అర్హులు వీరే..

గోకులం పథకం కింద షెడ్ల నిర్మాణానికి పశువుల పెంపకందార్లకు 90శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందార్లకు 70 శాతం చొప్పున రాయితీలు కల్పిస్తారు. ఉపాధి హామీ చట్టంలో జాబ్‌కార్డు ఉన్న చిన్న, సన్నకారు రైతులు అర్హులు. సంబంధిత దరఖాస్తులు రైతు సేవాకేంద్రం, మండల వ్యవసాయ కార్యాలయం, పశువైద్యశాలలో అందుబాటులో ఉంటాయి. దరఖాస్తుతో పాటు జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, షెడ్లనిర్మాణం చేపట్టే భూమి రిజిస్ట్రేషన్ ధృవపత్రం, బ్యాంకు పాసు పుస్తకం ఉండాలి. మండలానికి 25 చొప్పున గోకులం యూనిట్లు మంజూరు చేసినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

లబ్ధిదారుల ఎంపిక దాదాపు పూర్తయింది



ఇప్పటికే సఖినేటిపల్లి మండలంలో గోకులం లబ్ధిదారుల ఎంపిక దాదాపు పూర్తయింది. 30 వరకు ఎంపిక చేసిన దరఖాస్తులను వర్క్ ఆర్డర్లు ఇచ్చాం. త్వరలో నిర్మాణాలు ప్రారంభించే అవకాశం ఉంది.ప్రస్తుతం అన్ని మండలాల పరిధిలో అర్హత కలిగిన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం.ఉపాధి హామీ చట్టంతో అనుసంధానంగా గోకులం మినీ షెడ్ల నిర్మాణానికి అర్హుల ఎంపిక మండల స్థాయిలో జరుగుతుంది. ఆసక్తిగల పాడి రైతులు మండల పశువైద్యాధికారిని సంప్రదించి దరఖాస్తులు అందించాలి.

-దుర్గా ప్రసాద్ , ఎపిఒ, సఖినేటిపల్లి

పశువుల సంఖ్య- షెడ్డు యూనిట్ విలువ

2 పశువులు	- రూ.1.15 లక్షలు
4 పశువులు	- రూ.1.85 లక్షలు
6 పశువులు	-రూ.2.30 లక్షలు
20 గొర్రెలు, మేకలు	-రూ.1.30 లక్షలు
50 గొర్రెలు, మేకలు	- రూ.2.30 లక్షలు
100 కోళ్లు	- రూ.87 వేలు
200 కోళ్లు	- రూ.1.32 లక్షలు

గోకులాల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చాం



గోకులంషెడ్ల ఏర్పాట్లకు సంబంధించి 1400 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 840 గోకులాలకు అనుమతులు వచ్చాయి. మరికొన్ని గోకులంషెడ్లు మంజూరయ్యేవిధంగా చర్యలు తీసుకుంటాం. వీటిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి. అర్హులైన సన్న, చిన్నకారు రైతులకే మినీ గోకులాల షెడ్లు మంజూరు చేస్తాం.షెడ్డు నిర్మాణంలో ప్రతి దశలోనూ ఫొటోలు తీసి జియోట్యాగింగ్ చేస్తాం. ఇందులో పాడి ఆవులతో పాటు గొర్రెలు, మేకలు, కోళ్లకు సైతం షెడ్లు మంజూరు చేస్తాం.

-మధుసుదన్ పీడీ డ్వామా , అంబేద్కర్ కోనసీమ జిల్లా

గోపిమూర్తిని గెలిపించుకుందాం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్, ఆలమూరు


ఆలమూరులోని యుటిఎఫ్ హోమ్‌లో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు, జ్యోతిబసు

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తిని గెలిపించాలని కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు గొర్ల మాణిక్యం, జాన్ బాబు విజ్ఞప్తి చేశారు. కాకినాడ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ మూర్తిరాజుతో పాటు ఇతర అధ్యాపకులను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాణిక్యం మాట్లాడుతూ చట్ట సభల్లో ప్రజలపక్షం వహించే పిడిఎఫ్ ఎంఎల్‌సిలను గెలిపించుకోవలసిన ఆవశ్యకత ఉపాధ్యాయులపై ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు దుర్గాప్రసాద్, సత్యశ్రీదేవి, కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపి మూర్తి గెలుపే లక్ష్యంగా పని చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి జ్యోతిబసు పిలుపు ఇచ్చారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరులోని యుటిఎఫ్ హోమ్‌లో బుధవారం అద్దరి శ్రీనివాసరావు అధ్యక్షతన ప్రజా సంఘాల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపిమూర్తికి మద్దతు ప్రకటించాలని, అధిక మెజార్టీతో గెలిపించడానికి అందరూ కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు వైవివి.రమణ, పివివిజిఎస్ఎన్.మూర్తి, రాజు, మండల ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి ఎన్.శ్రీనివాస్, ఐసిడిఎస్ కో ఆర్డినేటర్ కృష్ణవేణి, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

యానిమేటర్ల సమస్యల పరిష్కారానికి డిమాండ్


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న యానిమేటర్లు

ప్రజాశక్తి - అమలాపురం

సమస్యలు పరిష్కరించాలని యానిమేటర్లు డిమాండ్ చేశారు. ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల రాష్ట్ర సంఘం (సిఐటియు)రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద విఓఏలు ధర్నాచేశారు. అనంతరం కలెక్టర్ మహేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.ఈ ధర్నా ను ఉద్దేశించి విఒఎ జిల్లా ప్రధాన కార్యదర్శి పాము వెంకటలక్ష్మి, సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు జి.దుర్గాప్రసాద్, ఎన్.బలరాం మాట్లాడుతూ విఒఎల న్యాయమైన డిమాండ్స్ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 8 నెలల నుంచి జీతాలు ఇవ్వకపోతే వారు ఏమి తిని పనిచేయాలనే ఆలోచన లేకుండా వారితో పని చేయించుకోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలసవ్యం వలన వారి కుటుంబాలు రోడ్డున పడిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే వారికి రావలసిన ఎనిమిది నెలలు బకాయి జీతాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 3 సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీరికి ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ నాయకులు వేధింపులను అరికట్టాలని అదేవిధంగా అక్రమంగా తొలగించిన విఒఎ ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. యాప్‌ల పేరిట వీరిని ఒత్తిడికి గురి చేయడం తగదని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం వీరికి ఇచ్చిన హామీ లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎప్పటికీ స్పందించకపోతే రాబోయే కాలంలో సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, నాగ విజయ, వేణు, దేవి పెద్ద ఎత్తున విఒఎలు పాల్గొన్నారు.

కోతలు వాయిదా వేసుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు

ప్రజాశక్తి - అంబాజీపేట

అల్పపీడనం వాయుగుండం బలపడే అవకాశం ఉన్నందున ఈ నెల 23 నుంచి 29వ తేదీ వరకూ వరి కోతలు వాయిదా వేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు రైతులకు విజ్ఞప్తి చేశారు. వక్కలంకలో బుధవారం పొలంబడి పిలుస్తోంది కార్యక్రమాని ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ రైతుల కోసిన ధాన్యాన్ని, పనల మీద ఉన్న వరిని మేరక మీద ప్రాంతాలకు తరలించి కుప్పలుగా వేసుకోవాలని అన్నారు. ప్రకృతి సేంద్రీయ సాగు చేస్తున్న రైతు గుత్తుల ధర్మారావుని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సిహెచ్‌డి.విజయకుమార్, ఎఇఒ డి.దుర్గారావు, ఉద్యాన శాఖ విస్తరణ అధికారి డి.వెంకటేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు బి.సౌజన్య, రైతులు గొల్లపల్లి పల్లయ్య, పిల్లి వ్యాఘ్రేశ్వరరావు, యాళ్ళ సత్యనారాయణ, అప్పారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు..

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం

ప్రజాశక్తి - అల్లవరం


స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి హామీ చట్టం ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎంపిడిఒ బి.కృష్ణ మోహన్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో 100 రోజులు పని పూర్తి చేసిన కుటుంబాల వివరాలు ఉన్నతి యాప్ లో నమోదు చేయాలని ఆదేశించారు. రైతులకు ప్రయోజనం కలిగే విధంగా ప్లానింగ్ ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ బి.కృష్ణ మోహన్, ఎపిఒ శ్రీను బాబు, సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొ న్నారు.

ఆధార్ నమోదు కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - అల్లవరం

చిన్నారులకు(0-6 వయస్సు) ఉన్న వారి తల్లి తండ్రుల బయోమెట్రిక్ ఆధారంగా ఆధార్ కార్డులు కొరకు మండలంలో నిర్వహిస్తున్న ప్రత్యేక చైల్డ్ ఆధార్ నమోదు కేంద్రాలను ఎంపిడిఒ బి.కృష్ణ మోహన్ బుధవారం తనిఖీ చేశారు. అల్లవరం - 2 సచివాలయం వద్ద నిర్వహిస్తున్న క్యాంప్‌లో కార్డు నమోదుకు పిల్లలతో వచ్చిన వారితో అక్కడ సదుపాయాలు, వేచి ఉంటున్న సమయం పై ఆరా తీయగా వారు సంతృప్తి వ్యక్తం చేశారు . 0-6 వయస్సు చిన్నారులు అందరూ చైల్డ్ ఆధార్ పొందేలా చర్యలు తీసుకోవాలని సచివాలయం సిబ్బంది ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బి.కష్ణ మోహన్, డిఎ.లోవరాజు, గ్రేడ్ 5 కార్యదర్శి సౌమ్య పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు


రామచంద్రపురం ఆర్‌డిఒకు అఖిలకు సన్మానం

ప్రజాశక్తి - యంత్రాంగం

గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో విజేతలకు ప్రముఖులు బహమతులు అందజేశారు. **రామచంద్రపురం** పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రామచంద్రపురం ఆర్‌డిఒ దేవరకొండ అఖిల అన్నారు. పట్టణంలోని గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. లైబ్రరీన్ దడాల వెంకటరమణ పర్యవేక్షణలో కార్యక్రమంనిర్వహించారు. కార్యక్రమంలో చందమామ వాసు, ప్రిన్సిపల్ ఎన్.శ్రీనివాస్, మునిసిపల్ డిఇ శ్రీకాంత్, కె.రవిబాబు, అడ్వొకేట్ సత్యనారాయణ ఉపాధ్యాయులు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. **కాట్రేనికోన:** కాట్రేనికోన, కందిపప్పు గ్రంథాలయాల్లో ముగింపు వేడుకలను నిర్వహించారు. వారోత్సవాల సందర్భంగా హైస్కూల్ స్థాయి విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన వారికి మండల స్థాయి అధికారులు చేతుల మీదగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సునీల్ కుమార్, ఎంపిడిఒ వెంకటాచలం, మండల విద్యాశాఖ అధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం :** శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి డి శివకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో పలువురు పాల్గొని మాట్లాడారు. **అల్లవరం: గోడి** గోడి శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో గ్రంథాలయవారోత్సవాలు ముగిశాయి. ముఖ్య అతిథులుగా గోడి జడ్‌పిహెచ్ఎస్ ప్రధాన ఉపాధ్యాయులు, ఎంపిపి స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పి.నారాయణ మరియు సిబ్బంది పాల్గొన్నారు. **ఆత్రేయపురం:** గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిశాయి . పలువురు ప్రముఖులు మాట్లా డారు. గ్రంథాలయ అధికారి టి.నమశ్శివాయ తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** గ్రంథాలయాలు విజ్ఞాన సంపాదన పెంపొందించి విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చుతాయని తహశీల్దార్ విఎస్.దివాకర్ అన్నారు.ఉప్పలగుప్తం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి సలాది నాగేశ్వరరావు అధ్యక్షతన బుధవారం గ్రంథాలయాల వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఘనంగా గ్రంధాలయ **అంబాజీపేట:** శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవ ముగింపు వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు ఎంఇఒ మోకా ప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడారు. గ్రంథాలయ అధికారి జి .శ్రీనివాసు వందన సమర్పణ చేశారు.

'పిఎం సూర్యఘర్'పై సమీక్ష

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కలెక్టరేట్ లో బుధవారం ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం అమలు పై జిల్లా స్థాయి కమిటీతో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సాంప్రదాయేతర ఇందన వనరుల ప్రోత్సా హంలో భాగంగా కేంద్రం అందిస్తున్న పిఎం సూర్య ఘర్ సబ్సిడీ వినియోగిం చుకొని ప్రతి ఇంటికి సోలారు విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పైలెట్ ప్రాజెక్టుగా వానపల్లి, పల్లిగూడెం, ఎస్ మూలపాలెం, అర్తమూరు. చింతలపల్లి అన్నయ్య పేట గ్రామాలతో పాటు అమలాపురం, మండపేట రామచంద్రపురం, ముమ్మిడివరం పట్టణ ప్రాంతాల్లో నూటికి నూరు శాతం పిఎం సూర్య ఘర్ సంబంధించి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాలలో మూడు కిలోవాట్లు సామర్థ్యం కలిగిన ప్లాంట్లు రూ. 78 వేల సబ్సిడీ తో ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని సూచించారు గ్రామీణ ప్రాంతాలలో కరెంట్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని ఆ మేరకు బ్యాంకు రుణాల కల్పన ద్వారా యూనిట్ల రాయితీతో ఏర్పాటుకు చర్యలు చేపట్టా లన్నారు ప్రజలంతా వినియోగించుకొనేలా ఈ పథకంపై విద్యుత్ శాఖ సిబ్బంది అవగాహన కల్పించాలని తెలిపారు. సోలారు యూనిట్ ఏర్పాటుతో ఉత్పత్తయిన విద్యుత్ మనం వాడు కోగా మిగిలిన విద్యుత్తో ప్రజలకు ఆదాయం వస్తుందనే విషయాన్ని ప్రచారం చేయాలని తెలిపారు. ఇంటిపై సోలారు యూనిట్ పెట్టుకొనుటకు అవకాశం గల ఇళ్లను గుర్తించి వారికి అవగాహన కల్పించాలని, దరఖాస్తు చేయించాలని తెలిపారు. సోలారు యూనిట్లు ఉపకరణాలను సరఫరా చేసే సంస్థలు నాణ్యమైన, వారంటీ గలవి మాత్రమే సరఫరా చేసే అంశంపై ఈ నెల 28న ఏజెన్సీ లతో సమావేశం నిర్వహించి యూనిఫామ్‌గా ధరలు నిర్ణయించడం తెలిపారు. విద్యుత్ శాఖ ఎస్ఇ ఎస్.రాజబాబు మాట్లాడుతూ పునరుత్పాదక ఇంధన వినియో గాన్ని పెంచుటకు, కర్బన ఉద్గారాలను తగ్గిం చుట కు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందని, వినియోగదారులు 10 కిలోవాట్ల వరకు నేరుగా ఆన్లైన్లో ధరఖాస్తు చేసుకొన వచ్చునని, అయితే మూడు కిలోవాట్ల వరకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, ఒక కిలోవాటుకు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ. 60వేలు, మూడు కిలోవాట్లకు గరిష్ఠంగా రూ.78 వేలను సబ్సిడీగా లభిస్తుందన్నారు యూనిట్ మొత్తానికి బ్యాంకు రుణం పొందే అవకాశం కూడా ఉందన్నారు. పెట్టుబడి మొత్తం ఐదు సంవత్సరాలలో తిరిగి వచ్చేస్తుందని తెలిపారు. మూడు కిలోవాట్ల యూనిట్ నెలకొల్పడానికి రూ.2 లక్షల 10వేలు వరకు ఖర్చు అవుతుందని ముందుగా లబ్ధిదారుడు 10 శాతం అనగా రూ.21వేలు చెల్లించాల్సి ఉంటుం దని మిగిలిన రూ.1.89 లక్షలకు బ్యాంకు నుండి పొందాల్సి ఉంటుందన్నారు . యూనిట్ స్థాపించిన పిదప 45 రోజులలో సబ్సిడీ నిధులు తిరిగి వినియోగదారుల బ్యాం కు ఖాతాకు జమ అవుతాయ న్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారులు ప్రతి నెలా 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొంద గలు గుతారని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ శివ శంకర్ ప్రసాద్, ఎల్‌డిఎం.కేశవ వర్మ, డిపిఒ శాంత లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రపురం అయ్యప్ప నాయుడు మున్సిపల్ కమిషనర్ అమలాపురం రాజు తదితరులు పాల్గొన్నారు.


సర్వేపై అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ రాజు

'ఎంఎస్ఎంఇ' సర్వేపై అవగాహన

ప్రజాశక్తి - ఆలమూరు

సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ) సర్వేపై అవగాహన ఉండాలని ఎంపిడిఒ, ఇంచార్జ్ డిఎల్‌పిఒ ఐ.రాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ ఎఒ మెహర్ ప్రకాష్, ప్రొగ్రాం ట్రైనర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పి.సంతోషిలతో కలిసి ఆయన కార్యదర్శులకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సర్వేపై అవగాహనా సదస్సు నిర్వహించారు. పలు అంశాలపై స్క్రీన్‌పై వివరించారు. అలాగే మీ గ్రామ పరిధిలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థితి గతులను సమగ్ర సర్వే చేస్తూ ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ పరిశ్రమల ప్రాంతంలో నిరుద్యోగ యువతకు శిక్షణ ద్వారా ఉపాధి కల్పించడానికి ఆస్కారం ఉంటుం దన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు సాయి ప్రసాద్, వెంకటరత్నం, విజయారెడ్డి, సుభాష్, వి.వేణి, హరేరామ్ పద్మావతి, గణేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.


సత్యనారాయణరాజుకు పూలబొకే అందజేత

కార్పొరేషన్ డైరెక్టర్లకు అభినందన

ప్రజాశక్తి - అయినవిల్లి

రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన సయ్యపరాజు సత్యనారాయణ రాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన బొంతు గంగాధరరావు(పెదబాబు)లను అయినవిల్లి మండల మాజీ జెడ్‌పిటిసి సభ్యురాలు గంగుమళ్ళ కాశీ అన్నపూర్ణ, శ్రీనివాస్ దంపతులు వారిని కలిసి అభినందనలు తెలియజేశారు. వారి సారధ్యంలో ఆయా సామాజిక వర్గాలలోని పేదవారికి కార్పొరేషన్ ద్వారా చేయూత అందించే అవకాశం టిడిపి గుర్తించి ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. వివిధ సందర్భాలలో వారు చేసిన సేవలను కొనియాడుతూ, భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించాలని కోరారు.

సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న నందంపూడి సర్పంచ్ మంగాదేవి

ప్రజాశక్తి - యంత్రాంగం

గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి సర్పంచ్‌లు బుధవారం శంకుస్థాపన చేశారు. వివరాలు ఇవి..

అంబాజీపేట: ఉపాధి హామీ నిధులతో గ్రామీణ ప్రాంతాలలో నిర్మించే సిసి రోడ్లు అభివృద్ధితో గ్రామాలు ముందంజలో ఉన్నాయని సర్పంచ్ పితాని మంగాదేవి, నాయకులు వీరాస్వామి అన్నారు. నందంపూడి కొత్తకాలనీలో 9లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించే రెండు రోడ్లు నిర్మాణ పనులకు బుధవారం భూమి పూజ చేశారు. నాణ్యతతో రోడ్లు నిర్మించాలని ఆమె విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు వడ్లమాని పద్మావతి, ఉప సర్పంచ్ నేదునూరి మురళి, జనసేన గ్రామ శాఖ అధ్యక్షులు బెండా శ్రీనివాసరావు, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు కేతా అర్జునుడు, వార్డు మెంబర్ నందంపూడి సత్యనారాయణ, రాయుడు సత్యనారాయణ, పితాని రమేష్, కాంద్రేగుల సత్యనారాయణ, కేతా గోవిందు,కార్యదర్శి బ్రహ్మాజీ రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలో గొల్లవిల్లి పంచాయతీ వాడపర్రు ఇందిరానగర్‌లో రూ.2 లక్షలతో నిర్మించే సిసి రోడ్డు నిర్మాణానికి బుధవారం సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ శంకుస్థాపన చేశారు. సర్పంచ్ శ్రీదుర్గ మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు కషి చేస్తున్నానని అవసరమైన ప్రాంతాల్లో సిసి రోడ్లు నిర్మిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు దోనిపాటి బాలమ్మ,మాజీ ఎంపిటిసి సభ్యుడు కాగిత సత్యనారాయణ, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు చీకట్ల ఏసుబాబు, జనసేన నాయకుడు మంచెం బాలకృష్ణ, వైసిపి నాయకుడు జొన్నాడ చిన్ని సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న గొల్లవిల్లి సర్పంచ్ శ్రీ దుర్గ

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక దిగు బడులనిచ్చే స్వల్ప కాలిక పంటలను ఎంపిక చేసుకోవాలని ఆచార్య ఎన్‌జి.రంగ విద్యాలయం, జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా (ఏరువాక) కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.నందకిషోర్ సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని జిల్లా కార్యాలయాల ప్రాంగణం లోని ఏరువాక కేంద్రం లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీ సీజన్ లో రైతులంతా స్వల్ప కాలంలో దిగుబడినిచ్చే పంటలైన వరి రకాలు ఎంటియు 3626(ప్రభాత్), ఎంటియు 1121(శ్రీ దతి), ఎంటియు 1156(తరంగిణి), ఎంటియు 1153(చంద్ర), ఎంటియు 1210(సుజాత), ఎంటియు రైస్1273 రకాలను వాడి తక్కువ పెట్టుబడి తో స్వల్ప కాలంలో అధిక దిగుబడి నిచ్చే పంటలను రైతులు ప్రోత్సహించాలని సూచించారు. రైతులు ఏరువాక కేంద్రాన్ని సందర్శించి సలహాలు, సందేశాలను నివృత్తి చేసుకోవచ్చునని, లేదా 94402 86682 నెం. ఫోన్ ద్వారా తెలుసుకోవచ్చునని ఆయన సూచించారు.

పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

- డిఇఒ సలీం బాషా

ప్రజాశక్తి - రామచంద్రపురం

వచ్చే ఏడాది జరిగే టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని డిఇఒ ఎస్‌కె.సలీంబాషా పేర్కొన్నారు. ద్రాక్షారామ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను డిఇఒ ఎస్‌కె.సలీం బాషా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడారు. రాబోయే పదవ తరగతి ఫలితాల్లో మంచి నైపుణ్యత కనబరచాలని విద్యార్థులకు ఉద్దేశించి ఆయన చెప్పారు. లక్ష్యాన్ని సాధించేందుకు ఉపాధ్యాయులు సక్రమ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ప్రత్యేక శ్రద్ధతో అనుసరణ ఉదయం మరియు సాయంత్రం నిర్వహించే అదనపు తరగతుల్లో మహిళా ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. పాఠ్యాంశాలను బోధిస్తున్న విస్సు మాస్టారు బోధనను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశంసించారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు జిల్లా సైన్స్ అధికారి గిరజాల సుబ్రహ్మణ్యంతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బందానికి పలు కీలక ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయిని సిహెచ్. రత్న పద్మావతి, ఉపాధ్యాయులు, పిల్లి రాంబాబు, సుజాత, శ్రీమన్నారాయణ, బొడ్డు సూర్యనారాయణమూర్తి, ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. కమ్యూనిటీ మొబైల్ ఆఫీసర్ బివి. సుబ్రహ్మణ్యం కూడా ఈ కార్యక్రమంలో హాజరయ్యారు.

నేరాలు ఘోరాలు

1,400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బుధవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవిడి.అర్జున్ రావు తెలిపారు. మండలంలోని రాయ భూపాలపట్నంలో 800 లీటర్ల బెల్లపు ఊటను, జగ్గంపేట మండలం జె కొత్తూరు గ్రామంలో 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ప్రసాదరావు, చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

8 మందికి జైలు.. 17 మందికి జరిమానా

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం కోరంగి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 8 మందికి జైలు, 17 మందికి జరిమానా విధించినట్లు ఎస్ఐ. సత్యనారాయణ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 17మందిలో 9 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించామని, జరిమానా చెల్లించని 8 మందికి కాకినాడ రెండవ మెజిస్ట్రేట్ జైలు శిక్ష విధించాని తెలిపారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న మరో 8 మందికి ఒక్కొక్కరికి రూ.300 చొప్పున జరిమానా విధించామని తెలిపారు.

కులం పేరుతో దూషించిన వారిపై కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఒక యువతితో గొడవపడి కులం పేరుతో దూషించిన నలుగురుపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇవి. . రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామానికి చెందిన మద్దాల నిరీక్షణ ఆత్రేయపురం గ్రామం కాలువ రేవు సెంటర్లో ఉన్న స్వామి పూతరేకులు షాపులో పనిచేస్తోంది. ఈనెల 5న ఆమె పనిచేస్తున్న సమయంలో పక్క షాపులో ఉన్న చింతా మారియ్య వచ్చి పూతరేకుల వ్యాపారం విషయంలో ఆమెతో గొడవ పెట్టుకుని కులం పేరుతో దూషించాడు. చింతా మారియ్యా కుటుంబ సభ్యులు కూడా ఆమెను కులం పేరుతో దూషించడంతో నిరీక్షణ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్ రాము తెలిపారు.

పారిశుధ్య సిబ్బందిని పెంచాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పట్టణ విస్తరణ, చెత్త వినియోగం దృష్టిలో పెట్టుకుని పారిశుధ్య కార్మికులను పెంచాలని మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో వర్రె గిరిబాబు అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో సంఘ కార్యదర్శి శివకోటి అప్పారావు మాట్లాడుతూ పట్టణ జనాభా, వినియోగం దృష్టిలో పెట్టుకుంటే పారిశుధ్య నిర్వహణకు 250 మంది కార్మికులు ఉండాలన్నారు. కానీ పెద్దాపురం మున్సిపాలిటీలో రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికులు కలిపి 80 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు వారాంతరపు సెలవులు ఇవ్వకుండా పూట సెలవులు ఇస్తున్నారన్నారు. వీరికి వారాంతరపు సెలవులు ఇవ్వాలన్నారు. కార్మిక శాఖ నిబంధనల ప్రకారం క్యాజువల్ లీవులు ఇవ్వటం లేదన్నారు. కార్మికులకు అవసరమైన పనిముట్లు మున్సిపాలిటీ సమకూర్చాలన్నారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు దొండపాటి శేఖర్, వర్రె రమేష్, భవాని, సత్యనారాయణ, మడికి కృష్ణ, రమేష్, దొండపాటి సురేష్, సిఐటియు నాయకులు సిరపరపు శ్రీనివాస్, డి.క్రాంతికుమార్ పాల్గొన్నారు.

కళ్యాణ మండపంలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక మున్సిపల్ కళ్యాణమండపంలో అగ్ని ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఫైర్ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ... ఫైర్ క్రాకర్స్ నిప్పు రవ్వలు ఎగిరిపడి అగ్ని ప్రమాదం సంభవించినట్టు తెలుస్తుందన్నారు. కళ్యాణ మండపం వంటశాలలో ఏర్పాటుచేసిన బరకాలు, ఫ్యాన్లు, ఇతర విద్యుత్ ఉపకరణాలు, ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనం మంటల్లో కాలిపోయాయని, సుమారు రూ. 4 లక్షల ఆస్తి నష్టం సంబంధించి ఉంటుందని అంచన వేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని సిరివాడ, కాండ్రకోట, తిరుపతి, చదలాడ గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎంపిడిఒ శ్రీలలిత బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ సుధీర్, జెఇ సతీష్‌కుమార్, పంచాయతీరాజ్ ఎఇ శ్రీనివాసరావు, ఆయా గ్రామాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యానాం వార్తలు


నేటి నుంచి విద్యా - వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి - యానాం

స్థానిక పిఎం రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల్లో ఈనెల 21 నుంచి 23 వరకూ విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు ప్రాంతీయ విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శన గురువారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని శనివారం సాయంత్రం ఐదు గంటలకు ముగుస్తుందన్నారు. ఈ ప్రదర్శనలో ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి ఇంటర్మీడియట్ వరకూ ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు తయారుచేసిన సుమారు 200 పైగా సాంకేతిక అంశాలకు సంబంధించిన ప్రదర్శనలు ఉంటాయన్నారు.

డివైడర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

- మడికి మార్కెట్ వద్ద కానరాని డివైడర్
- డివైడర్ కోసం కూరగాయల రైతుల పట్టు
- కనీసం సర్వీసు రోడ్డుకు నోచుకోని వైనం
- పట్టించుకోని జాతీయ రహదారి అధికారులు



మడికి మార్కెట్ వద్ద ట్రాఫిక్ దుస్థితి



మార్కెట్లో వివిధ చోట్ల నుంచి దిగుమతైన కూరగాయల లాట్లు

ప్రజాశక్తి - ఆలమూరు

జాతీయ రహదారి 216 ఎ పక్కన మండలంలోని మడికి అంతరాష్ట్ర కూరగాయల మార్కెట్ దశాబ్దాలుగా విశేష గుర్తింపు పొందింది. అయితే ఈ మార్కెట్ కు రాకపోకలు సాగించడానికి రైతులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అనేక ప్రమాదాలు జరిగి కొంత మంది ప్రాణాలు కోల్పోగా మరి కొంతమంది క్షతగాత్రులుగా మిగిలారు. దీనంతటికి కారణం మార్కెట్ వద్ద రాకపోకలకు డివైడర్ లేకపోవడమే. పోనీ రైతు క్షేమం కోసం ఉన్న డివైడర్ నుంచి మార్కెట్ వరకు సర్వీస్ రోడ్డు ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. అయితే ఇక్కడ మడికి సెంటర్ నుంచి కడియం మండలం పొట్టిలంక వరకు ఉన్న జాతీయ రహదారి మధ్యలో డివైడర్ సౌకర్యం లేదు. అయితే ఈ మధ్యలో అంత రాష్ట్ర కూరగాయల మార్కెట్ ఉంది. దీంతో రావులపాలెం వైపు నుంచి వచ్చే రైతులు వారి పండించిన పంటలను మోటార్ సైకిల్ ఆటోల ద్వారా మడికి నుంచి రాంగ్ రూట్ లో మార్కెట్కు వెళ్లాల్సి వస్తోంది. ఈ సమయంలోనే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతే కాదు మార్కెట్లో కొనుగోలు చేసిన కూరగాయలను కడి యం పొట్టిలంక వైపునకు కూడా రాంగ్ రూట్ లోనే తీసుకెళ్తున్నారు. ఈ సమయంలో కూడా ప్రమాదాలు పెద్ద సంఖ్యలో జరుగుతున్నాయి. ఈ ప్రమాదాలు నివారణకు నేషనల్ హైవే అధికారులు పలుసార్లు పరిశీలన జరిగినప్పటికీ ఏమీ చేయలేకపోతున్నారు. రైతులు, కొనుగోలుదారులు మార్కెట్ ఎదురుగా రాకపోకలకు డివైడర్ సౌకర్యం కల్పించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ మార్కెట్ కు నిత్యం గోదావరి జిల్లాల నుంచే గాక తెలంగాణ, ఒడిశా, పశ్చిమబెంగాల్ ప్రాంతాల నుంచి కూరగాయల ఎగుమతులు దిగుమతులు జరుగుతూ ఉంటాయి. సీజన్ బట్టి కొన్ని రకాల కూరగాయలను ఇక్కడకు దిగుమతి చేసుకుంటే మరికొన్ని రకాల కూరగాయలను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ ఉంటారు. దీంతో ఇక్కడకు పెద్ద ఎత్తున రైతులు పండించిన పంటలతో పాటు కొనుగోలు చేసిన వాటిని వారి వ్యాపార వాహనాలపై తీసుకెళుతూ ఉంటారు. ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు స్పందించి మార్కెట్ ఎదురుగా రాకపోకలకు డివైడర్ సౌకర్యం కల్పించాలని కూరగాయల రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

డివైడర్ తో పాటు సర్వీస్ రోడ్డు నిర్మించాలి

జాతీయ రహదారిపై 216 ఎ మడికి వద్ద అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్ రైతు సేవలో నిత్యం పనిచేస్తుంది. అలాగే ఈ కూరగాయల మార్కెట్ కు వివిధ రాష్ట్రాల నుంచి కూరగాయలు ఎగుమతి దిగుమతులు జరుగుతూ ఉంటాయి. అయితే రవాణాకు రహదారి అనుకూలంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. దీనికి డివైడర్ తో పాటు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేస్తే రైతులకి, వ్యాపారులకు, వినియోగదారులకు మరింత అనువుగా ఉంటుంది. ఇప్పటికైనా జాతీయ రహదారి ఉన్నతాధికారులు స్పందించి మార్కెట్ రాకపోకలకు మార్గాన్ని అభివృద్ధి చేసి సహకరించాలని కోరుతున్నాం.

బాల్య వివాహాల నివారణకు కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న పలువురు అధికారులు

ప్రజాశక్తి - అమలాపురం

స్వర్ణాంధ్ర ఏ2047 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, అభివృద్ధి సూచికల సాధనకు పెను సవాలుగా మారిన బాల్య వివాహాల ను నివాణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పి డి ఎం ఝాన్సీ రాణి తెలిపారు.బుధవారం స్థానిక కలెక్టరేట్లోని గోదావరి భవన్ నందు విద్య, వైద్య,ఇంటర్మీడియట్ బోర్డ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ శాఖల ఆధ్వర్యంలో కిషోర్ వికాసం పై జిల్లాస్థాయి శిక్షకుల శిక్షణ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. డిఎల్‌డిఒ భీమారావు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. బాలికల అభివృద్ధి కొరకు అందరూ సమన్వయం వహించిన రోజునే అభివృద్ధి మానసిక వైద్యులు డాక్టర్లు యోనస్ సౌమ్యశ్రీ లు బాల బాలికల మానసిక స్థితిగతులు వయసు వారీగా పరివర్తన వంటి అంశాలపై పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి జి.సూర్య ప్రకాశం, డిఎల్‌డిఒ టి. త్రినాధరావు, జూని యర్ లెక్చరర్ ఎం.శాంతి శ్రీ, ఎఫిఎం అర్జున్ తదిత రులు పాల్గొన్నారు.

ఎజిపి విద్యా ప్రసన్నకు అభినందన

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక జూనియర్ సివిల్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా బాధ్యతలు స్వీకరించిన బూసి విద్యా ప్రసన్న దంపతులను బుధవారం టిడిపి సీనియర్ నాయకులు ఈదల సత్తిబాబు, ఈదల నల్ల బాబు అభినందించారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వం ఎజిపిగా విద్యా ప్రసన్నను నియమించడంతో ఆమె ఇటీవల ఎజిపిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో ఆమెను కలిసి సాలువతో సత్కరించి వారు అభినందనలు తెలియజేశారు.

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆలమూరు

ఎఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు విజయనగరం నందు జరగనున్న నేపథ్యంలో మహాసభలకు సంబంధించి పోస్టర్లను ండలం పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకట్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. నవంబర్ 27, 28, 29 తేదీల్లో ఈ సభలకు విద్యార్థి సంఘాలు, విద్యార్థులు హాజరై జయప్రదం చేయవలసిందిగా జిల్లా అధ్యక్షులు వెంకట్ కోరారు.

23న న్యాయ అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - అమలాపురం

ఉప్పలగుప్తం మండల ప్రజా పరిషత్ కార్యాలయపు మండల మహిళ సమాఖ్య కార్యా లయంలో ఈ నెల 23న ఉదయం 11 గంటలకు న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు బ్లాక్ స్థాయిలో జాతీయ మహిళా కమి షన్, విధాన్ సే సమాధాన్ పేరిట మహిళలతో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించను న్నట్లు మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ రెండవ అదన పు జిల్లా న్యాయమూర్తి వి .నరేష్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. న్యాయ అవగాహన శిబిరంలో మహిళ లు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

'ఎన్క్యూఎస్' సర్టిఫికెట్ రావడంపై హర్షం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

వాక తిప్ప పీహెచ్‌సీకి పీహెచ్‌సీ స్టాండర్డ్స్‌పై 95 శాతం నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్ క్యూఎస్) కింద సర్టిఫికెట్ లభించింది. ఈనెల 7, 8, తేదీల్లో సెంట్రల్ గవర్నమెంట్ టీం, పీహెచ్‌సీలోని ల్యాబ్, స్టాండర్డ్స్ ఆసుపత్రి పరిశుభ్రత, ఒపి, ఐపి, నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్స్, లేబర్ రూమ్ తదితర అంశాలను పరిశీలించి వెళ్ళింది . దీనిపై పీహెచ్‌సి పనితీరు పట్ల రాష్ట్రంలో ఎవ్వరికి రాని విధంగా నూటికి అత్యధికంగా 95 శాతం తమ పీహెచ్‌సీకి లభించిందని, ఇందుకు జిల్లా టీం కూడా ప్రశంసించిందని పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ రాకేష్‌చౌదరి, డాక్టర్ చంద్రమౌళి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు హర్షం వ్యక్తంచేశారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - రాజోలు

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని రాజోలు సిఐ నరేశ్ కుమార్ బుధవారం హెచ్చరించారు. మలికిపురం ఎఎఫ్‌డిటి నియర్ కళాశాల ఇంటర్ విద్యార్థి రామేశ్వరపు జయసాయి యువరాజును నలుగురు యువకులు చెట్టుకు కట్టి దారుణంగా చితకబాదిన ఘటన పై ఆయన స్పందించారు. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న వీడియోను చూసిన పోలీసులు ఎఎఫ్‌డిటి జూనియర్ కళాశాలకు వెళ్లి ఆరా తీశారు. ఈ క్రమంలో విద్యార్థి తండ్రి రామేశ్వరపు శంకర్ తన కుమారుడిని తీసుకెళ్లి ఆసుపత్రిలో చేర్చి మలికిపురం పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. విద్యార్థి యువరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రవి అనే యువకుడితో సహా మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నలుగురు యువకులను మలికిపురం ఎస్ఐ సురేష్ అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారని ఆయన తెలిపారు.

రక్తదానం చేద్దాం.. ప్రాణదాతలుగా నిలుద్దాం

ప్రజాశక్తి - కాకినాడ

రక్తదానం చేద్దాం ప్రాణదాతలుగా నిలుద్దా మని ఐడియా డిగ్రీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాం డెంట్ డాక్టర్ పి.చిరంజీవిని కుమారి పిలుపునిచ్చారు. నగరంలోని ఐడియల్ కళాశాల ఆర్ట్స్ అండ్ సైన్సెస్(ఎ) వద్ద ఎన్ఎస్ఎస్ విభాగం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సంయుక్తంగా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్.పి.చిరంజీవిని కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదానం చేస్తే ఒక పూట ఆకలి తీర్చవచ్చునని, విద్యా దానం చేస్తే జ్ఞానం పంచవచ్చునని, అదే రక్తదానం చేస్తే ప్రాణదాతలుగా నిలవచ్చునని అన్నారు. అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని, అందుకు యువకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ వైడి.రామారావు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాలు సంభవించినప్పుడు క్షతగాత్రులకు వైద్య సేవలు చేసే ఒకే ఒక సంస్థ రెడ్ క్రాస్ అని చెప్పారు. అకాడమిక్ డైరెక్టర్ ఎం.రంజిత్ మాట్లాడుతూ సరైన సమయానికి రక్తదానం చేసేవారు దేవుడి లాంటి వారిని అన్నారు. సభాధ్యక్షులు డాక్టర్ టి.సత్యనారాయణ మాట్లాడుతూ రక్తదానంతో మరొకరికి జీవితాన్ని ఇచ్చినట్లు అవుతుందని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.స్టీవెన్ రాజు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వైఆర్ఎల్.చౌదరి, డి.విశ్వనాథరాజు, జి.మార్తాండం, ఎం.మాచారావు, ఎం.గోపాలకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు..

ఆయిల్ పామ్ సాగుతో రైతులకు ఆదాయం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎన్.మల్లికార్జున అన్నారు. బుధవారం స్థానికంగా సాగులో ఉన్న పామాయిల్ తోటలను ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యానవన శాఖ అధికారి ఎం.శ్రీవల్లి అధ్యక్షతన పామాయిల్ సాగుపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏలేశ్వరం, ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల్లో 600 హెక్టార్లలో పామాయిల్ సాగు లక్ష్యంగా అధికారులు పని చేయాలన్నారు. పామాయిల్ రైతులకు రాయితీపై మొక్కలు అందించడంతోపాటు నాలుగేళ్ల పాటు సాగు నిర్వహణకు రూ.71 వేలు అందజేయడం జరుగు తుందన్నారు. వాణిజ్య రైతులు సాగు బీమా పొందేల అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో ఆయన ఫెడ్ డివిజనల్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల రైతుసేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట

సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సిఐ ఎ.కృష్ణ భగవాన్ అన్నారు. బుధవారం మండలంలోని వికె.రాయపురం జడ్‌పి హైస్కూల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ప్రస్తుతం జరుగుతున్న డిజిటల్ అరెస్టులు, ఈజీ మనీ సంపాదించడం పట్ల యువత ప్రక్కదారి పడుతున్న తీరును ఆయన వివరిం చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

విద్యార్థినిలు లక్ష్య సాధనకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని ఎస్ఐ జ్వాలా సాగర్ సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక మహిళా డిగ్రీ కళాశాల్లో బుధవారం ప్రిన్సిపల్ జివి. రమణ మూర్తి అధ్యక్షతన మహిళా సంరక్షణ పై అవగాహనా సదస్సు జరిగింది.ఈ సదస్సుకు స్థానిక ఎస్ఐ జ్వాలా సాగర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సోషల్ మీడియాలో పరిచయం అయ్యే అపరిచితుల పట్ల విద్యార్థినిలు అప్రమత్తంగా ఉండాలని, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకుని ఆత్మ విశ్వాసంతో లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. ఎవరైనా సోషల్ మీడియాలో దూషించినా తక్షణమే సమీపంలోని పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గణేశుల బ్రహ్మానందం కళాశాల అధ్యాపకులు మరియు మహిళా కానిస్టేబుల్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.



విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి

విజయ్‌కుమార్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి - పి.గన్నవరం

ఎపి మాల సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ పెదపూడి విజయ్ కుమార్ ని పి.గన్నవరం ఎంఎల్ఏ గిడ్డి సత్యనారాయణ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల బొకే అందజేసి శాలువా కప్పి సత్కరించారు. మాలలు ఎక్కువగా ఉన్న నియోజకవర్గంలో వారి సంక్షేమంపై దష్టి సారించాలని కోరారు. అదేవిధంగా విజయవాడ సెంట్రల్ ఎంఎల్ఎ బొండా ఉమామహేశ్వరరావుని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వంగా కలిసి శాలువాతో సత్కరించారు..

మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

పేదలకు తక్కువ రేట్లకు, వైద్యులు మానవతా దక్పథంతో సేవలు అందించాలని ముమ్మిడివరం శాసన సభ్యుడు దాట్ల సుబ్బరాజు, డిఎంహెచ్ఓ ఎం దుర్గారావు దొరలు సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక శ్రీదేవి థియేటర్ సమీపంలో డాక్టర్ కళ్యాణి చే నూతనంగా ఏర్పాటు చేసిన మహిక ఆసుపత్రి ని బుధవారం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, డిఎంహెచ్ఓ దుర్గారావు దొర ప్రారంభించారు. కార్యక్రమంలో గుత్తుల సాయి చెల్లి అశోక్ వైద్యులు జె.శివకుమార్, ఎన్.జగన్ మోహన్, వైటి.నాయుడు, ఎన్.అనిల్ కుమార్, సిహెచ్.అనిల్ కుమార్, సిహెచ్ వీణా సరస్వతి స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నియోజకవర్గాల వారీగా సన్నాహక సభలు

ప్రజాశక్తి - రావులపాలెం

ఇటీవల రాజ్యాంగాన్నీ, హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలకు బుద్ధిచెప్పేందుకు త్వరలో మాలలు భారీ లాంగ్ మార్చ్, భారీ సభ నిర్వహించేందుకు కార్యాచరణ నియోజకవర్గాలు వారీగా సన్నాహక సభలు నిర్వహిస్తున్నామని మాల నాయకులు ఇసుకపట్ల రఘుబాబు పేర్కొన్నారు. జిల్లా మాల సన్నద్ధ సభ రావులపాలెం ఆదిలక్ష్మి నగర్‌లో గొల్లపల్లి డేవిడ్ రాజ్ అధ్యక్షతనలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాల నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, జంగా బాబు రావు, కోట రామ్మోహన్‌రావు, నెల్లి లక్ష్మీపతి హాజరయ్యారు. కార్యక్రమంలో కప్పల శ్రీధర్, ఏనుగుపల్లి వెర్రియ్య, గెడ్డం శ్రీనివాస్, కప్పల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు యువత ముందుకు రావాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఆర్థిక అక్షరాస్యతను సాధించేందుకు నిరుద్యోగ యువత సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలని మండల పరిషత్ విస్తరణ అధికారిణి సి.హెచ్. లక్ష్మీ కళ్యాణి సూచించారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో నందు బుధవారం ఎండిఒ వెంకటాచారి అధ్యక్షతన ఎంఎస్ఎంఈ సర్వే పై పంచాయతీ కార్యదర్శులు మరియు సచివాలయం సిబ్బందికి ఒక రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - రాయవరం

మండలంలోని మాచవరం గ్రామంలో పలివెల శోభన ఎంపిటిసి-1 సభ్యురాలు పలివెల సతీష్(37) గత శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ మేరకు బుధవారం అనపర్తి నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ దంపతులు ఎంపిటిసి సభ్యురాలు శోభన కుటుంబాన్ని పరామర్శించారు. సతీష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సతీష్ మరణం గురించి కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాచవరం గ్రామ సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి, అప్పారావు, సోమేశ్వరం మాజీ ఎంపిటిసి సభ్యుడు కోట వెంకట్రావు, లొల్ల గ్రామ సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, వార్డు మెంబర్లు ఉన్నారు.



విద్యుత్ శాఖ అవగాహనా సదస్సులో డిఇ, ఇతర అధికారులు

ఇంధన వనరులను సమృద్ధిగా అందించడమే ప్రభుత్వాల లక్ష్యం

ప్రజాశక్తి - రామచంద్రపురం

భవిష్యత్తు తరాలకు ఇంధన వనరులను సమృద్ధిగా అందించటమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ఆదాపై దృష్టి సారించాయని తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ ఇపిడిసిఎల్ రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.మురళీమోహన్ రావు తెలిపారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఉర్జ వీర పథకంపై బుధవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో ప్రజా కాంతి ఎలక్ట్రీషియన్ ప్లంబర్ అండ్ రివైండింగ్ వర్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కృష్ణ సెక్రటరీ మల్లికార్జున్ రెడ్డి 50 మంది వర్కర్లకు శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ ప్రతి ఇంట్లో వినియోగించే విద్యుత్ పరికరాలు విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఫైవ్ స్టార్ రేటింగ్ పరికరాలను వినియోగించడంతో విద్యుత్ ఆదా అవుతుందన్నారు. గృహాలకు ఎలక్ట్రికల్ వైరింగ్ చేసే ఎలక్ట్రీషియన్లు ఈ దశగా వినియోగదారుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఉర్జా వీర పథకంలో నమోదు చేసుకుంటే కేంద్రం వీరి సేవలను గుర్తించి పారితోషకాలు ఇస్తుందన్నారు. ఉర్జా వీర వెబ్ సైట్ లో ఎలక్ట్రీషన్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 22న గుంటూరులో ఈ పథకాన్ని సిఎం ప్రారంభిస్తారని తెలిపారు . అనంతరం అసిస్టెంట్ ఇంజినీర్ రామ చంద్రపురం రూరల్ ఎఇ ఎంవి.రమణ ఉర్జా వీర పథకంపై ఎలక్ట్రీషన్లకు అవగాహన కల్పించారు.